AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## అట్టింగల్ ఎంపీతో ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు భేటీ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కేరళ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఏఐసీసీ పరిశీలకుడు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కేరళం వెళ్లారు. అక్కడ మంగళవారం అట్టింగల్ ఎంపీ, యూడీఎఫ్ కన్వీనర్ అదూర్ ప్రకాష్‌తో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఎన్నికల వ్యూహాల గురించి చర్చించారు.


24-3-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## కామారెడ్డిలో భారీ వర్షం



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణంలో భారీ వర్షం కురుస్తోంది. ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడింది. బలమైన ఈదురు గాలులతో ఒక్కసారిగా భారీ వర్షం కురుస్తుండడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షంతో కాసేపు జనజీవనం స్తంభించిపోయింది. అయితే నాలుగైదురోజులుగా ఉక్కపోతగా వాతావరణం ఉండడం.. మంగళవారం సాయంత్రం వర్షం పడడంతో పట్టణ ప్రజలు కొంతమేర ఉపశమనం పొందారు. జిల్లాలోని భిక్కనూరు మండలం కాచాపూర్, బస్వాపూర్ గ్రామాల్లో వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. వడగళ్లు పడడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. రైతులు సైతం అకాల వర్షంతో హైరానా పడ్డారు.

## ఆర్మూర్ మున్సిపాలిటీ ఎదుట కార్మికుల ఆందోళన




**అక్షరటుడే, ఆర్మూర్:** ఎన్నికల విధులు నిర్వహించిన కార్మికులకు డబ్బులు చెల్లించకపోవడంతో మంగళవారం ఉదయం విధులు బహిష్కరించారు. అనంతరం మున్సిపల్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నెల రోజుల పాటు విధులు నిర్వహించిన కార్మికులకు ఒక్క రూపాయి చెల్లించకపోవడంతో వారు ఆందోళనకు దిగారు. మరోవైపు ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సైతం కేవలం పది రోజులు డబ్బులు మాత్రమే చెల్లించారన్నారు. ఎన్నికల విధులు నిర్వహించిన వారందరికీ డబ్బులు చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. అక్కడికి చేరుకున్న మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌లతో కార్మికుల వాగ్వాదానికి దిగారు. డబ్బులు చెల్లించే వరకు విధులు నిర్వహించబోమని ఆందోళన చేపట్టారు.


## జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్‌కు ఆమోదం



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్ :** జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతూ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు అంతరెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.6,44,92,000 ఖర్చు చేసేందుకు ఆమోదం తెలిపారు. అలాగే జిల్లా కేంద్ర గ్రంథాలయం నూతన భవనానికి గాను.. రూ.4 కోట్లు కేటాయించడం జరిగిందని అంతిరెడ్డి రాజిరెడ్డి తెలిపారు. నందిపేట్, సిరికొండలో సొంత భవనాల కోసం టీజీఈడబ్ల్యూఐడీసీ ప్లాన్ అంచనా ప్రకారం నిర్మాణం కోసం ఆమోదం తెలిపారు. సాలూరలో శాఖ గ్రంథాలయం ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు రాజిరెడ్డి పేర్కొన్నారు. డిచ్‌పల్లి, వెల్మల్ గ్రంథాలయాల్లో టాయిలెట్స్ నిర్మాణం కోసం సర్వసభ్య సమావేశంలో ఆమోదం తెలిపారన్నారు. కొత్త పుస్తకాల కోసం రూ. 8లక్షలు వెచ్చించాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి, డీపీవో, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి పాల్గొన్నారు.

**దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాలు పెంచేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను పెంచేందుకు త్వరలో బిల్లు ప్రవేశ పెట్టనుంది. లోక్‌సభ స్థానాలతో పాటు ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ సీట్లలో దాదాపు 50 శాతం పెరగనున్నాయి. ఈ మేరకు అమిత్ షా ప్రకటించారు. దీంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సైతం కొత్తగా మూడు నియోజకవర్గాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజనపై రాజకీయ వర్గాలతో పాటు ప్రజల్లో చర్చ జరుగుతోంది.**

- అక్షరటుడే, కామారెడ్డి




# పునర్విభజనపై చర్చ

- అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలు పెంచుతామన్న కేంద్రం
- ఉమ్మడి జిల్లాలో మూడు నియోజకవర్గాలు ఏర్పడే అవకాశం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రస్తుతం తొమ్మిది నియోజకవర్గాలు ఉన్నాయి. నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బోధన్, బాల్కొండ, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో బాన్సువాడ నియోజకవర్గం కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఉంది. పునర్విభజన చేపడితే పూర్తిస్థాయిలో కామారెడ్డి జిల్లాకు చెందే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఏర్పడే నియోజకవర్గాలపై స్పష్టత లేకున్నా జోరుగా చర్చ జరుగుతోంది.

### కామారెడ్డి అర్బన్ స్థానం

నియోజకవర్గాల పునర్విభజన చేపడితే కామారెడ్డి జిల్లాలో ఒకటి, నిజామాబాద్ జిల్లాలో రెండు చొప్పున నియోజకవర్గాలు ఏర్పడతాయన్న ప్రచారం సాగుతోంది. ఇందులో కామారెడ్డి అర్బన్, డిచ్‌పల్లిపాటు రుద్రూర్ కూడా కొత్త నియోజకవర్గాలు ఏర్పడతాయని ప్రచారం రాజకీయ వర్గాల్లో సాగుతోంది. దాంతో ఆయా నియోజకవర్గాల శివారు ప్రాంతాల ప్రజలు తాము నియోజకవర్గం మారుతామా అని చర్చించుకుంటున్నారు.

### శివారు ప్రాంతాల విలీనం

కామారెడ్డి జిల్లాలో కామారెడ్డి అర్బన్ నియోజకవర్గం అవుతుందన్న ప్రచారం నేపథ్యంలో విలీన గ్రామాలపై జోరుగా చర్చ సాగుతోంది. ప్రస్తుతం కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో రెండు మండలాలు కొనసాగుతున్నాయి. కామారెడ్డి అర్బన్, రూరల్ నియోజకవర్గాలు అయితే శివారు మండలాల్లో నుంచి కొన్ని గ్రామాలను రూరల్ నియోజకవర్గంలో కలిపే అవకాశాలు ఉన్నాయి. అర్బన్ నియోజకవర్గం కోసం కామారెడ్డి మండలంలోని అన్ని గ్రామాలు అర్బన్‌లో కలుస్తాయన్న టాక్ వినిపిస్తోంది.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రణాళిక: సీపీ




**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రోడ్డు భద్రత కార్యక్రమాలను ముమ్మరం చేస్తామని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల కోసం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రోడ్డు భద్రత కార్యక్రమాలను ముమ్మరం చేయాలని, రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను ఎప్పటికప్పుడు తొలగించాలని, రోడ్డు ఆక్రమణలను తొలగించేందుకు శ్రీకారం చుట్టాలన్నారు. రోడ్డు ప్యాచ్‌ల గుర్తింపు, గుంతలు, దెబ్బతిన్న రోడ్డు భాగాలను గుర్తించాలని.. అటవీ ప్రాంతాలలో భద్రతా చర్యలు, అవసరానికి అనుకూలంగా వివిధ రోడ్డు మార్గాలలో రిఫ్లెక్టర్ల ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రమాదం జరిగే స్థలాలను గుర్తించి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. స్పష్టంగా కనిపించడం కోసం రిఫ్లెక్టివ్ మార్కింగ్‌లు వేయాలన్నారు. ప్రధాన కూడళ్లు, ప్రమాదకర ప్రదేశాలు, ఎక్కువ మంది నడిచే ప్రాంతాలు సాధ్యమైన చోట సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ అడ్మిన్ జి.బస్వారెడ్డి, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి జె.ఉమామహేశ్వర రావు, ఆర్టీసీ డిపో మేనేజర్ బి.ఆనంద్, ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్, ఐడార్ మేనేజర్ వర్ష, ఎన్ఎస్‌సీ జాయింట్ సెక్రెటరీ దుష్యంత్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య పాల్గొన్నారు.

## వారంతపు సంత, మార్కెట్ వేలం

**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని గ్రామపంచాయతీలో సర్పంచ్ గాండ్ల రాజేష్ అధ్యక్షతన వారంతపు సంత, రోజువారి మార్కెట్‌కు వేలం నిర్వహించారు. ఈ వేలంలో వారంతపు సంతను అత్యధికంగా రూ.6,25,000కు ద్యావతి ముత్యం దక్కించుకున్నారు. అలాగే రోజువారి మార్కెట్ వేలంను రూ.1,45,000కు భోజన్న హక్కులు పొందారు. కార్యక్రమంలో ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 25న నందిపేట్‌లో ఆర్టీసీ ప్రయాణికులతో సమావేశం

**అక్షరటుడే, ఆర్మూర్:** నందిపేట్ బస్టాండ్ ఆవరణలో ప్రజా సేవల మెరుగుదలపై 25న ప్రయాణికులతో సమావేశం నిర్వహించనున్నట్లు నిజామాబాద్ డిపో-1 మేనేజర్ ఆనంద్ తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని.. ప్రయాణికులు తమ సమస్యలను సమావేశంలో విన్నవించవచ్చని తెలిపారు.




## ప్రజలను మోసం చేస్తున్న మోదీ, రేవంత్ రెడ్డి: నర్సయ్య

**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రజలను మభ్యపెట్టేలా తప్పుడు వాగ్దానాలతో ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య విమర్శించారు. పట్టణంలోని వీక్లి మార్కెట్‌లో మంగళవారం అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రథమ రాష్ట్ర మహాసభల సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం చేపడుతున్న కార్యక్రమాలు, ఉద్యమానికి ప్రజలు సహకరించాలన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన ఆరు వాగ్దానాలను పక్కన పెట్టి కాలం వెల్లదీస్తున్నారని ఆరోపించారు. ప్రపంచానికి పెద్దన్నగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏది చెబితే అది ప్రధాని మోదీ చేస్తున్నారంటూ విమర్శించారు. ప్రజలు రోజు కూలి చేసుకుంటూ 100 రోజులు ఉన్న ఉపాధి హామీ కార్యక్రమాన్ని 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేస్తుంటే ఉన్న పథకానికి పేరు మార్చి పని లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయ కార్మిక సంఘానికి పార్టీ వెన్నుదన్నుగా ఉందని, వ్యవస్థలో మార్పు కోసం సంఘం పని చేస్తుందని చెప్పారు.

## రైతు భరోసా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త నాటకం: దినేష్ కులాచారి



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** రైతు భరోసా పేరుతో తెలంగాణ రైతాంగాన్ని మళ్లీ మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త నాటకం మొదలు పెట్టిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నిధులు విడుదల చేశామంటూ షో చేస్తారని.. కానీ రైతుల ఖాతాల్లో డబ్బు పడేది మాత్రం కొన్ని నెలలకు లేదా ఏడాది డబ్బులు పడతాయని దినేష్ ఆరోపించారు. ఎన్నికలు దగ్గరపడితేనే రైతు భరోసా గుర్తొస్తుందా? జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ముందు రైతుల భావోద్వేగాలతో ఆడుకోవడమే లక్ష్యమా అంటూ ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. వరంగల్ డిక్లరేషన్‌లో ఎకరానికి రూ.15,000 ఇస్తామని ఘనంగా హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ... అధికారంలోకి వచ్చిన వెంటనే మాట మార్చి రూ.12,000కే పరిమితం చేసిందన్నారు. ఎన్నికలప్పుడు ఒకటి చెప్పి, అధికారంలోకి వచ్చాక ఇంకొకటి చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అసలు స్వరూపాన్ని బయటపెడుతోందని దుయ్యబట్టారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.12,000 ఇవ్వాలని ప్రకటించినా.. అది సకాలంలో, ఒకేసారి రైతుల ఖాతాల్లో జమవుతుందా అంటే స్పష్టత లేదన్నారు. ఇప్పటికీ నాలుగు సీజన్లకు భరోసా డబ్బును కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిందన్నారు. రైతుకు నిజమైన భరోసా అంటే.. సకాలంలో, పూర్తి మొత్తంలో సాయం అందించడమని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఆలస్యం, కత్తిరింపులు, ప్రచారం అనే మూడు సూత్రాలతో వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. రైతుకు అవసరం ఉన్నప్పుడు డబ్బు ఇవ్వాలి గాని.. కాంగ్రెస్ ప్రభుత్వానికి సౌకర్యంగా ఉన్నప్పుడు కాదన్నారు.

## క్రైం బీట్ సిబ్బందికి ఎస్పీ అభినందన

**అక్షరటుడే, కామారెడ్డి:** రాత్రి సమయంలో బస్టాండ్‌లో ఓ మహిళ వద్ద బ్యాగ్ దొంగిలించి పారిపోతున్న దొంగలను క్రైం బీట్ సిబ్బంది సాహసం చేసి పట్టుకున్నారు. మంగళవారం వారిని ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించారు. మంగళవారం అర్ధరాత్రి కామారెడ్డి పట్టణంలోని వివేకానంద కాలనీలో క్రైం బీట్ సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్న సమయంలో ఓ బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వెళ్తున్నట్లు గమనించి వెంబడించి బైక్ ఆపారు. వారి వెంట ఉన్న మహిళను గమనించి వారి వద్ద ఉన్న బ్యాగు గురించి ఆరా తీయగా సరైన సమాధానం చెప్పలేదు. అదే సమయంలో బ్యాగులో ఉన్న ఫోన్ మోగడంతో పోలీసులు ఆన్సర్ చేయగా అవతలి వైపు ఓ మహిళ ఆ బ్యాగు తనదేనని, బస్టాండ్‌లో ఉన్న తనవద్ద నుంచి ఎత్తుకెళ్లారని చెప్పింది. దీంతో పోలీసులు వారిని ఠాణాకు తీసుకెళ్లారు. బ్యాగును బాధితురాలికి అప్పగించారు. విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించిన సిబ్బంది ప్రశాంత్ రెడ్డి, హోంగార్డు నర్సింలును ఎస్పీ రాజేష్ చంద్ర ప్రత్యేకంగా అభినందించారు.



## కళ్ల సంరక్షణకు జాగ్రత్తలు పాటించాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నేత్ర సమస్యలను అశ్రద్ధ చేయకూడదని, శరీర అవయవాలలో అత్యంత ప్రధానమైన కంటి చూపును జాగ్రత్తగా కాపాడుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో బోర్గాం(పి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి బాలబాలికలకు కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కంటి చూపు మందగించకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ, ఆకు కూరలు, క్యారెట్ వంటి వాటిని ఆహార పదార్థాల్లో భాగం చేసుకోవాలని సూచించారు. ఇదివరకు తాను కూడా దృష్టి లోపంతో ఇబ్బందిపడ్డానని, తగిన వ్యాయామాలు, సరైన ఆహారపు అలవాట్లతో ఆ సమస్యను అధిగమించానని కలెక్టర్ వెల్లడించారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించేందుకు వీలుగా జిల్లాలో సుమారు 70 వేల మంది వరకు విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇప్పటికే 41వేల మందికి కంటి పరీక్షలు పూర్తయ్యాయని తెలిపారు. ఇందులో భాగంగానే అవసరమైన వారికి అంధత్వ నివారణ సంస్థ ద్వారా ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నేత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో అశ్విని, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ పీవో డాక్టర్ సుజాత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అజ్మల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్, ఉపాధ్యాయులు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రాథమిక సహకార సంఘంలో మహాజనసభ

**అక్షటుడే, పెద్ద కొడప్‌గల్:** మండలంలోని ప్రాథమిక సహకార సంఘంలో మంగళవారం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో సందీప్ కుమార్ అర్ధవార్షిక నివేదికను చదివి వినిపించారు. సంఘ సభ్యులు రూ.2వేలు ఎఫ్‌పీవో జమ చేసి సభ్యుడిగా చేరాలని సూచించారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. జొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో ఎరువుల సమస్య వేధిస్తోందని.. రైతులకు ఎరువుల కొరత రాకుండా చూడాలని కోరారు. అదేవిధంగా రైతులు పండించిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని కూడా ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పర్సనల్ ఇన్‌ఛార్జి సురేష్, సొసైటీ మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## చేపూర్ వీడీసీ అధ్యక్షుడిగా మీనుగు నాగరాజు



**అక్షరటుడే, ఆర్మూర్:** మండలంలోని చేపూర్ నూతన అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా మీనుగు నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొమ్మిది కులాల సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వీడీసీ ఉపాధ్యక్షుడిగా సూరినీడ దశరథ్, ప్రధాన కార్యదర్శి సురకంటి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా శెట్టి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా సొక్కం సంజీవ్, గౌరవ సభ్యులుగా బట్టు సురేష్, పున్ని, పట్నం నడిపి లింగన్న, కంపదండి సాయన్న నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడు మీనుగు నాగరాజు మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి, అందరినీ కలుపుకొని అభివృద్ధి చేస్తామన్నారు.


## శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం



**అక్షటుడే, పెద్ద కొడప్‌గల్:** మండలంలోని ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. తేమ శాతం 14 శాతం ఉండాలని, చెత్తాచెదారం లేకుండా రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. పంటలను దళారులను అమ్మి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.5,875 మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. ఎకరాకు ఏడు క్వింటాళ్ల 13కిలోల వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు.

# టీబీని తరిమికొడదాం..

**మానవాళిని వేధిస్తున్న ప్రమాదకర వ్యాధుల్లో క్షయ (టీబీ) కూడా ఒకటి. ఇది మైకోబాక్టీరియం ట్యూబర్‌క్యులోసిస్ అనే బాక్టీరియ వల్ల వస్తుంది. ఇది ఒక తీవ్రమైన అంటు వ్యాధి. ముఖ్యంగా ఊపిరితిత్తులను ఇది ప్రభావితం చేస్తుంది. అనంతరం క్రమంగా మూత్రపిండాలు, మెదడు వంటి ఇతర భాగాలను సైతం దెబ్బతీస్తుంది. వరల్డ్ ట్యుబర్క్యులోసిస్ డే నేపథ్యంలో.. అసలు టీబీ ఎందుకు వస్తుంది, లక్షణాలు, ట్రీట్‌మెంట్, ఇతర వివరాలను డాక్టర్ బొద్దుల రాజేంద్ర ప్రసాద్ 'అక్షరటుడే' ద్వారా వివరించారు.** - అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ




**వ్యాధి సోకితే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం**

**చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం**

**ప్రముఖ వైద్యుడు బొద్దుల రాజేంద్రప్రసాద్**



టీబీ అనేది అంటు వ్యాధి. వ్యాధి సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు లేదా మాట్లాడినప్పుడు గాలిలో సూక్ష్మ కణాలు విడుదలవుతాయి. ఈ కణాలను ఇతరులు ఊపిరి పీల్చినప్పుడు వ్యాధి సోకే అవకాశం ఏర్పడుతుంది. అయితే ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ప్రతియేటా మార్చి 24న 'ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం' నిర్వహిస్తున్నారు. 1882లో ఇదే రోజున డాక్టర్ రాబర్ట్ కోచ్.. మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్‌ను కనుగొన్నారు. దీంతో ఈ రోజు నాడు వరల్డ్ ట్యుబర్క్యులోసిస్ డే జరుపుతున్నారు.

### లక్షల మంది బాధితులు

క్షయ వ్యాధితో (టీబీ) ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది బాధపడుతున్నారు. వ్యాధి సోకిన వ్యక్తి ఆరోగ్యాన్ని ఇది తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. అయితే సరైన అవగాహన, త్వరితగతిన గుర్తింపు, సకాలంలో చికిత్స తీసుకోవడం ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చు.

### క్షయ వ్యాధి కారణాలు

క్షయ వ్యాధి మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల సంక్రమిస్తుంది. ఈ బ్యాక్టీరియా ప్రధానంగా గాలి ద్వారా వ్యాపిస్తుంది. టీబీ బాధితులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు లేదా మాట్లాడినప్పుడు గాలిలో చిన్నచిన్న సూక్ష్మ కణాలు విడుదలవుతాయి. కణాలను ఇతరులు పీల్చినప్పుడు వ్యాధి సోకే అవకాశం ఉంటుంది.

### వ్యాధి నిర్ధారణ

క్షయ వ్యాధిని గుర్తించడానికి వైద్యులు కొన్ని అత్యాధునిక పరీక్షలను సూచిస్తారు. వీటిలో కఫం పరీక్ష (స్పుటం టెస్ట్), ఛాతీ ఎక్స్‌రే, వంటి ఆధునిక మాలిక్యులర్ పరీక్షలు, బ్రాంకోస్కోపీ, థొరాకోస్కోపీ పరీక్షల ద్వారా నిర్ధారించవచ్చు. ఒకవేళ క్షయ వ్యాధి సోకినట్లు నిర్ధారణ జరిగితే సకాలంలో చికిత్స పొందడం వల్ల పూర్తిగా నయం అవుతుంది.

### చికిత్స పద్ధతులు

క్షయ వ్యాధికి చికిత్స తీసుకోవడం వల్ల పూర్తిగా నయం అవుతుంది. సాధారణంగా 6 నుంచి 9 నెలల వరకు డాక్టర్ సూచించిన మందులను క్రమం తప్పకుండా తీసుకోవాలి. వైద్యుల సలహా ప్రకారం మందుల కోర్సును పూర్తి చేయాలి. మధ్యలో ఆపేస్తే వ్యాధి మళ్లీ తిరిగి వచ్చే ప్రమాదం ఉంటుంది. సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవడం ఎంతో ముఖ్యం. వైద్యుల సూచనల మేరకు చికిత్స తీసుకోవడంతో పాటు మంచి పోషకాహారం తీసుకోవడం వల్ల క్షయ వ్యాధి నుంచి బయట పడొచ్చు.

### క్షయ వ్యాధి కారకాలు

- రోగనిరోధక శక్తి బలహీనపడడం
- పోషకాహార లోపం
- మధుమేహం (డయాబెటిస్)
- ధూమపానం, మద్యపానం
- క్షయ బాధితులతో సన్నిహిత సంబంధాలు ఉండడం

### లక్షణాలు

- రెండు వారాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం నిరంతర దగ్గు ఉంటుంది.
- దగ్గులో రక్తం కలిసి రావడం జరుగుతుంది.
- సాయంత్రం వేళల్లో వచ్చే జ్వరం వస్తుంది.
- రాత్రి సమయంలో అధిక చెమటలు పడతాయి.
- శరీర బరువు తగ్గిపోవడం జరుగుతుంది.
- అలసట, ఆకలి లేకపోవడం లక్షణాలు కనిపిస్తాయి.



## మాగి హనుమాన్ ఆలయంలో యజ్ఞం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామంలో హనుమాన్ ఆలయంలో స్వాముల ఆధ్వర్యంలో పవిత్ర హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి హోమంలో పాల్గొని విశేషపూజలు నిర్వహించారు. కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ముఖ్య అతిథిగా విచ్చేసి హోమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. ధార్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడమే కాకుండా, శాంతి, సౌభ్రాతృత్వానికి మార్గదర్శకాలు అవుతాయని పేర్కొన్నారు.



## ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై అవగాహన

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన నిర్మూలన అనే అంశంపై పోస్టర్ మేకింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి, రెండో స్థానాలు దక్కించుకున్న విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ (అటానమస్) డిగ్రీ కళాశాల, కామారెడ్డి కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవోలు ఎస్ చంద్రకాంత్, రాణి అధ్యాపక బృందం పాల్గొంది.

## లయన్స్ భవనంలో కంటి వైద్య శిబిరం




**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని కిసాన్ నగర్‌లోని లయన్స్ క్లబ్ భవనంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యాధికారి పుణ్యరాజు 25 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో మోతిబిందు సమస్య ఉన్న రోగులను గుర్తించి శస్త్ర చికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ చాకులింగం, జోనల్ ఛైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ సమావేశాల్లో మున్సిపల్ కార్మికులపై చర్చ జరగాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** మున్సిపల్ కార్మికుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి తక్షణమే పరిష్కరించాలని పట్టణానికి చెందిన మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో పాల్గొనేందుకు వారు "చలో హైదరాబాద్" కార్యక్రమానికి బయలుదేరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జే.రవీందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు కార్మికులకు అనేక హామీలు ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపల్ కార్మికులను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బుజ్జిగారి సాయిలు, మేత రాజు, పెరక శివరాజు, నల్ల కాశీరాం, తాటి గంగారం, అత్తర్ ముక్కగల సాయిలు, నల్ల బాలమణి, సాయవ్వ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి




**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్ :** జిల్లాలో ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈవో అశోక్ కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రఘురాం నాయక్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పలు కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా, అదేవిధంగా డోర్ టు డోర్ ప్రచారం చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. అదేవిధంగా 2026-27కు గాను.. విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే.. హోర్డింగులు, ఫ్లెక్సీలు పెట్టి సీబీఎస్‌సీ సిలబస్ పేరుతో అడ్మిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రులను తప్పు దోవ పట్టిస్తున్న ప్రైవేటు కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా క్రిమినల్ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సుభోద్, జిల్లా ఉపాధ్యక్షుడు కుశాల్, జిల్లా నాయకులు కిషోర్, నిఖిల్, గణేష్ పాల్గొన్నారు.బ

## బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకుల ముందస్తు అరెస్ట్




**అక్షరటుడే, బాన్సువాడ:** హామీల అమలు కోసం శాంతియుతంగా అసెంబ్లీ ముట్టడి చేపట్టాలని నిర్ణయించుకున్న బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం తగదని బాన్సువాడ మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ జుబేర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తెల్లవారుజామున పోలీసులు బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్వీ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రవట్టి సాయిబాబా, ఫిరోజ్, ఖలీల్, యువజన నాయకుడు రమేష్ యాదవ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా షేక్ జుబేర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని విమర్శించారు.

## ప్రభుత్వ కళాశాల విద్యార్థికి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం



**అక్షర టుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి కురుమ మహేష్‌కు జెనెసిస్ ఇన్ఫర్మేషన్ ఇండియా సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం లభించిందని ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఇదే స్ఫూర్తితో మిగతా విద్యార్థులు కూడా ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. టీఎస్‌కేసీ, ప్లేస్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ శివకుమార్, అధ్యాపకులు సిద్ధు రాజు, సురేష్ రెడ్డి, దశరథ్, అరుణ్ కుమార్, గంగారెడ్డి పాల్గొన్నారు.

# రుద్రూర్ శివారులో రోడ్డు ప్రమాదం.. 45 మందికి గాయాలు

**అక్షరటుడే, బాన్సువాడ:** రుద్రూర్ శివారులో మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఘటనలో బస్సు డ్రైవర్‌తో పాటు లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 45 మంది ప్రయాణికులు ఉండగా, అందులో 10 మందికి తీవ్ర గాయాలు కాగా, మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి పంపించారు. అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.





### రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**నిజామాబాద్ సిటీ:** వాహనాదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సీపీ సాయిచైతన్య సూచించారు. ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను అంబులెన్స్‌లో బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు. బాధితులకు బోధన్ ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యవసర వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. మెరుగైన వైద్యసేవల కోసం క్షతగాత్రులను నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సీపీ వెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు, రుద్రూర్ ఎస్సై సాయన్న తదితరులున్నారు.